ఇంకా ఎంతమంది చనిపోవాలి?

- టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య ఆగ్రహం
- గుండెపోటుతో మరో ఆటోడ్రైవర్ మృతి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఇంకా ఎంతమంది ఆటోడ్రైవర్లు చనిపోతే కాంగ్రెస్ సర్కారు స్పందిస్తుందో చెప్పాలి? అని టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటికే 50మందికి పైగా ఆటోడ్రైవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు స్కీం కల్పించడంతోనే ఆటోడ్రైవర్లు గిరాకీ కోల్పోయారని పేర్కొన్నారు. ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆటోడ్రైవర్లను ఆదుకోకపోతే మృతుల కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఎత్తున పోరాటానికి దిగుతామని, సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అన్ని ఆటో యూనియన్లతో చర్చించి త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. మేడ్చల్‌లోని రావల్కల్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మల్కపాటి శ్రీను(45)బుధవారం గుండెపోటుతో మరణించగా అంత్యక్రియలకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రావల్కల్‌కు చెందిన ఆటోడ్రైవర్ మల్కపాటి శ్రీను అంత్యక్రియలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- ములుగు జిల్లాలో విషాదం

జయంత్(ఫైల్)

మంగపేట, ఆగస్టు 21: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరులో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లూరు గ్రామానికి చెందిన ఆళ్ల జయంత్(26) గతేడాది ఐదెకరాల్లో మిర్చి సాగు చేశాడు. పంటకు తెగుళ్లు సోకి దిగుబడి సరిగా రాక అప్పుల పాలయ్యాడు. దీనికితోడు కొత్తగా నిర్మించిన ఇంటికి కూడా అప్పులు చేశాడు. మొత్తం రూ. 12 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని తీర్చే మార్గం లేక ఆందోళనకు గురైన జయంత్ ఈనెల 19న మండల కేంద్రంలోని గంపోని గూడెం సమీప జామాయిల్ తోటలో గడ్డిమందు తాగాడు. అనంతరం ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. వెంటనే వారు జయంత్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.



KTR @KTRBRS

Tired of 7hour power cut and zero support from the electricity department, local youth in Bayyaram climbed the pole and had to restore the electricity

Very dangerous but they had no choice because of the reckless behavior of the authorities

Appreciate the young man for his daredevil work but it shouldn't have to happen

The Energy department and the Discom seem clueless on how to handle public issues

స్తంభం ఎక్కి.. జంపర్ వేసి

'నమస్తే తెలంగాణ' కథనంపై కేటీఆర్ స్పందించి ట్విట్టర్‌లో చేసిన పోస్ట్

ఏడు గంటలు కరెంట్ పోతే సర్కార్ పట్టించుకోదా?

- ప్రజా సమస్యలపై ప్రభుత్వానికేదీ చిత్తశుద్ధి?
- 'నమస్తే' కథనంపై ట్విట్టర్ వేదికగా స్పందించిన కేటీఆర్

బయ్యారం ఆగస్టు 21: 'ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా..? ఏడు గంటలు కరెంట్ పోతే విద్యుత్తు శాఖ పట్టించు కోదా? స్థానికులు పోల్ ఎక్కి పరిష్కరించుకోవడం ఆశ్చర్యం వేసింది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్)లో పోస్ట్‌చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం పెంకుతండాలో ఏడు గంటలపాటు విద్యుత్తు లేక పోవటంతో స్థానిక యువకులే మరమ్మతు చేసుకొని కరెంట్ సరఫరాను పునరుద్ధరించుకున్న విషయాన్ని బుధవారం 'నమస్తే తెలంగాణ'లో 'స్తంభం ఎక్కి.. జంపర్ వేసి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. తండాలో దాదాపు 7 గంటల పాటు కరెంట్ పోయినా విద్యుత్తు అధికారులు పట్టించుకోకపోవటంతో స్థానిక యువకుడే కరెంట్ పోల్ ఎక్కి సమస్య పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యుత్తు సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతో విసిగిపోయిన స్థానికులే ఇలా కరెంటు సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారంటే ప్రభుత్వానికి ప్రజల సమస్యలపై ఎంత చిత్తశుద్ధితో ఉన్నదో అర్థమవుతుందని అన్నారు. స్థానికంగా ఉండే యువకుడే పోల్ ఎక్కి రిపేర్ చేసే ప్రయత్నం చేసినందుకు ఆ యువకుడిని కేటీఆర్ ప్రశంసించారు. ఇది చాలా ప్రమాదకరమైనప్పటికీ ప్రజలకు వేరే మార్గం లేని పరిస్థితి తెచ్చారని విద్యుత్తు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించే విషయంలో విద్యుత్తు శాఖ, డిస్కమ్‌లు ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నాయో ఈ ఘటన తెలియజేస్తున్నదంటూ ప్రభుత్వం, అధికారులు తీరుపై ఆసంతృప్తి వ్యక్తంచేశారు.

బీజేపీ పరువు నష్టం కేసులో సీఎంకు నోటీసులు

- సెప్టెంబర్ 25న కోర్టుకు రావాలని రేవంత్‌కు కోర్టు ఆదేశం

నాంపల్లి కోర్టులు, అగస్టు 21 (నమస్తే తెలంగాణ): తప్పుడు ఆరోపణలు చేసి బీజేపీ ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఆరోపిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదుపై నాంపల్లిలోని ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీచేసింది. వచ్చే నెల 25న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. కుట్రపూరితంగా రేవంత్ బీజేపీపై అనుచిత వాఖ్యలు చేశారని ఫిర్యాదుదారుడితోపాటు అజయ్‌కుమార్ వాంగ్మూలాన్ని నమోదు చేసిన కోర్టు నోటీసులు జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకాశం స్టేడియంలో మే 4న జరిగిన సభలో రేవంత్‌రెడ్డి బీజేపీ అధికారం చేపట్టేలోపే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగిస్తుందని ఆరోపించారు. దీనికి సంబంధించిన వార్తలను ఫిర్యాదుదారు కోర్టుకు సమర్పించారు. మీటింగ్‌కు హాజరైన 50 వేల మంది ప్రజలకు తప్పుడు సమాచారాన్ని అందించారని పిటిషన్‌లో వివరించారు.

మురుగు కాల్వలో చిన్నారి గల్లంతు

- నిజామాబాద్‌లో దయనీయ ఘటన
- అసంపూర్తి సీసీ వర్క్ వల్లే ప్రమాదం?
- చిమ్మ చీకట్లోనూ సహాయక చర్యలు

నిజామాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అప్పటిదాకా ఆడుతూ కనిపించిన రెండేండ్ల చిన్నారి, ఒక్కసారిగా కనిపించకుండా పోయింది. ఇంటిముందున్న మురుగు కాల్వలో పడి గల్లంతయినట్టు స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని ఆనంద్‌నగర్‌లో బుధవారం సాయత్రం ఈ ఘటన జరగగా, చీకటిలోనూ సహాయక చర్యలు కొనసాగాయి. ఆనంద్‌నగర్‌కు చెందిన మారుతి, పూజ దంపతుల కూతురు అను (2) ఉన్నట్టుండి కనిపించకపోవడంతో మురుగుకాల్వలో పడి ఉంటుందని మున్సిపల్, అగ్నిమాపక సిబ్బందికి తల్లిదండ్రులు, స్థానికులు సమాచారమిచ్చారు. సహాయ బృందాలు రంగంలోకి దిగి కాల్వలో గాలిస్తున్నాయి. చీకటి పడటంతో గాలింపు చర్యలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. మురుగు కాల్వ సుమారు కిలోమీటర్ మేర తెరిచి ఉన్నది. సీసీ వర్క్ ఇంకా పూర్తి కాలేదు. మూడు అడుగుల వెడల్పుతో ఉండటంతో కాలువ అంచులోకి ఏమాత్రం వెళ్లినా అందులో జారిపడే అవకాశమున్నది. చుట్టుపక్కల ప్రాంతాల మురుగుతో పాటు వర్షాల కారణంగా భారీ వరదతో కాల్వ ప్రమాదకరంగా పారుతున్నది. ఈ క్రమంలో బాలిక అందులో పడి కొట్టుకుపోయి ఉంటుందని భావిస్తున్నారు.

చిన్నారి అను (ఫైల్)

గాలిస్తున్నాం..

చిన్నారి గల్లంతైన సమాచారం తెలిసిన వెంటనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్‌కు సమాచారమిచ్చాం. సిబ్బందితో వెంటనే సహాయక చర్యలు ముమ్మరం చేసి గాలింపు చర్యలు చేపట్టాం. పాప ఆచూకీ కోసం చీకట్లోనూ శ్రమిస్తున్నాం. ప్రవాహం భారీగా ఉండటం, కాల్వలోతు ఎక్కువే ఉండటం ఇబ్బందికరంగా మారింది.

– మకరంద్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

తల్లిదండ్రులిద్దరూ కూలీ పనులకు వెళ్లడంతో అమ్మమ్మ పాప సంరక్షణ చూసుకుంటున్నది. బుధవారం సాయంత్రం 4గంటల వరకు ఇంటి ముందు ఆడుకున్న పాప హఠాత్తుగా కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది చుట్టుపక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో కాల్వలోనే పడి ఉంటుందని నిర్ధారించుకొని గుండెలు పగిలేలా విలపిస్తున్నారు.

నీట మునిగి ఇద్దరు బాలుర మృతి

- గృహప్రవేశానికి వచ్చి ఈతకు వెళ్లి మృత్యువాత
- కొండపాక మండలం సిరిసనగండ్లలో విషాదం

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 21 : గృహప్రవేశం కోసం వచ్చి చెరువులో మునిగి ఇద్దరు బాలురు మృత్యువాతపడ్డారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసనగండ్లలో బుధవారం జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన బస్వరాజ్ మల్లేశ్ సిరిసనగండ్లలో తన చెల్లె రేణుక గృహప్రవేశానికి రెండు రోజుల కిత్రం కుటుంబంతో వచ్చాడు. కొడుకు బస్వరాజ్ హేమంత్(17)తో కలిసి అతడి స్నేహితుడు నిఖేశ్ వర్ధన్(13) కూడా వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం లో హేమంత్, నిఖేశ్ వర్ధన్, రేణుక కొడుకు సముద్రాల అరుణ్‌కుమార్ కిరాణా షాప్‌కు వెళ్తున్నామని చెప్పి చెరువులో ఈతకు వెళ్లారు. నీళ్లలోతును అంచనా వేయక హేమంత్, నిఖేశ్ వర్ధన్‌లోపటికి వెళ్లి ఈత రాక మునిగిపోయారు. అరుణ్‌కుమార్ ఈత కొట్టుకుంటూ బయటకు వచ్చి కేకలు వేశాడు. చుట్టుపక్కల వాళ్లు వచ్చేసరికి ఇద్దరూ చనిపోయారు. మల్లేశ్ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓటుకు నోటు కేసులో బాబుకు ఊరట

- నిందితుడిగా చేర్చే పిటిషన్‌పై విచారణకు సుప్రీం నిరాకరణ

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు భారీ ఊరట లభించింది. ఈ కేసులో చంద్రబాబునాయుడును నిందితుడిగా చేర్చి, దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్ ధర్మాసనం ఎదుట బుధవారం ఈ కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఆళ్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ఓ నామినేటెడ్ ఎమ్మెల్యేను ప్రలోభపరిచేందుకు ఫోన్‌లో మాట్లాడుతూ చంద్రబాబు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారని.. ఆ కాల్‌రికార్డ్స్ ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే రూ.5 కోట్లు ఇస్తానని, అదే గైర్హాజరైతే రూ.2 కోట్లు ఇస్తానని రేవంత్‌రెడ్డితో బేరసారాలు జరిపించారని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించింది. ఈ కేసులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలూ కనిపించడం లేవని స్పష్టం చేసింది.

వ్యాయామ కాలేజీని అప్‌గ్రేడ్ చేయాలి

- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల (జీసీపీఈ)ను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. ఇందుకు బీఆర్ఎస్ సర్కారు గతంలోనే రూ.20 కోట్లు కేటాయించిందని చెప్పారు.

మూడేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 21 : మూడేండ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ ఘటన సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు 24 గంటల్లోపు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట మైత్రీవనంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే తన భార్య, మనుమరాలితో కలిసి ఉంటున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో పెయింటర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం మూడేండ్ల చిన్నారిని ఆడిస్తానని చెప్పి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారి గట్టిగా ఏడ్వడంతో వాచ్‌మన్ చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేసి చిన్నారిని సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నిందితుడిని బుధవారం పొన్నాల గ్రామ శివారులో పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిన్నారి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

కాంట్రాక్టర్ నుంచి 15 వేలు లంచం

- ఎంపీవో, కార్యదర్శిని పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఆళ్లపల్లి, ఆగస్టు 21 : మాజీ ఉపసర్పంచ్, కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకున్నది. మర్కోడు మాజీ ఉప సర్పంచ్ కమల చేసిన రోడ్డు పనులకు పర్సంటేజీగా ఎంపీవో బత్తుల శ్రీనివాస్, మర్కోడు పంచాయతీ కార్యదర్శి తాటి నాగరాజు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు ఎంపీవో, పంచాయతీ కార్యదర్శికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రూ.15 వేలు లంచం ఇస్తుండగా.. అప్పటికే మాటు వేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు రాజశేఖర్, మల్లేశ్, రాజు, ఆళ్లపల్లి ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా

కమలాపూర్, ఆగస్టు 21: యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రైతుల పేరిట యూరియా బస్తాలను పీఏసీఎస్ అధికారి ఫర్టిలైజర్ వ్యాపారులకు అమ్ముతుండగా అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపెల్లిగూడెంలో బుధవారం చోటుచేసుకున్నది. పీఏసీఎస్ గోడౌన్ అధికారులు బయోమెట్రిక్‌తోపాటు రైతు ఆధార్‌కార్డు నంబర్ నమోదు చేసుకుని యూరియా బస్తాలు అమ్మకాలు చేయాలి. కానీ నిబంధనలు పాటించకుండా మర్రిపెల్లిగూడెం గోడౌన్ అధికారి రైతుల పేరుతో ఫర్టిలైజర్ వ్యాపారులకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఆటో ట్రాలీలో యూరియా బస్తాలు గ్రామంలోని ఫర్టిలైజర్ షాపు వద్దకు రావడంతో రైతులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏవో లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ నోడల్ అధికారి దేవేందర్‌రెడ్డి విచారణ జరిపారు. షాపు యజమానికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తానని తెలిపారు. పట్టుబడిన యూరియాను తిరిగి గోడౌన్‌కు తరలించామని చెప్పారు. పీఏసీఎస్ నోడల్ అధికారి దేవేందర్‌రెడ్డిని కదిలించగా.. ఏవోనే చర్యలు తీసుకుంటారంటూ దాటవేశారు.

అటకెక్కిన బతుకమ్మ చీరల పంపిణీ

- ఆర్డర్లు లేక నష్టపోతున్న చేనేత కార్మికులు
- ఇప్పటివరకు పంపిణీపై స్పందించని కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలకు రూ.2157 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి ఏడాది ఉచితంగా పంపిణీ చేసే బతుకమ్మ చీరల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. బతుకమ్మ ప్రారంభం కావడానికి 40 రోజుల సమయం మాత్రమే ఉన్నా చీరల పంపిణీ గురించి ఎలాంటి హడావుడిలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నేతన్నలకు బతుకమ్మ చీరల తయారీపై ఆర్డర్లేవీ రాలేదు. పనులు లేక ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్న నేతన్నల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. 2017 – 2023 వరకు ప్రతి సంవత్సరం బతుకమ్మ చీరలు అందుకున్న మహిళలు ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందా లేదా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చేతినిండా పనిలేక అల్లాడుతున్న నేతన్నలు..

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలను నేతన్నలకు ఇచ్చి, వారికి చేతి నిండా పని కల్పించి ఆదుకున్న ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కింది. 2017 నుంచి ప్రతి ఏడాది కోటి మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. 2017 నుంచి 2023 వరకు బతుకమ్మ చీరల తయారీ కోసం రూ. 2,157 కోట్లు కేటాయించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలకు కేటాయించిన నిధులు

సంవత్సరం	నిధుల కేటాయింపు
2017	222.48 కోట్లు
2018	280.00 కోట్లు
2019	313.00 కోట్లు
2020	317.81 కోట్లు
2021	333.14 కోట్లు
2022	339.73 కోట్లు
2023	351.52 కోట్లు
మొత్తం	2,157.68 కోట్లు

సెప్టెంబర్ 21న పంచాయతీ ఓటర్ల తుది జాబితా

- -ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు జోరందుకున్నాయి. వార్డులు, గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఓటర్ల తుది జాబితాను సెప్టెంబర్ 21న విడుదల చేయనున్నారు. ఓటర్ల జాబితాపై బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సీ పార్థసారథి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితారామచంద్రన్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అదనపు డైరెక్టర్ జనరల్ సంగ్రామ్ సమావేశంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా షెడ్యూల్ ప్రకారం.. సెప్టెంబర్ 6న ఓటర్ల జాబితా ముసాయిదాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉంచుతారు. 9,10 తేదీల్లో ముసాయిదాపై కలెక్టర్లు, మండలాభివృద్ధి అధికారులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. ఓటర్ల జాబితా ప్రచురణ ప్రక్రియపై అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈ నెల 29న ఉదయం 11:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

ఓటర్ల జాబితా షెడ్యూల్

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల:	సెప్టెంబర్ 6
అభ్యంతరాల స్వీకరణ :	సెప్టెంబర్ 7-13
అభ్యంతరాల పరిష్కారం :	సెప్టెంబర్ 19
ఓటర్ల తుది జాబితా ప్రచురణ:	సెప్టెంబర్ 21

పెంకుతండా ఘటనపై విద్యుత్తు శాఖ ఆరా

నమస్తే ఎఫెక్ట్

బయ్యారం ఆగస్టు 21: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని పెంకుతండా గ్రామంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఘటనపై ఆ శాఖ అధికారులు ఆరా తీశారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడగా స్థానిక యువకులే విద్యుత్తును పునరుద్ధరించుకోవడంతో 'స్తంభం ఎక్కి.. జంపర్ వేసి' కథనాన్ని 'నమస్తే తెలంగాణ' ప్రచురించింది. జిల్లాస్థాయి అధికారుల ఆదేశంతో ఏడీ రమేశ్ బుధవారం కొత్తపేటలోని సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అంతరాయానికి సంబంధించిన వివరాలు సిబ్బంది వద్ద తెలుసుకొని రికార్డులు పరిశీలించారు. 3.55 గంటలు మాత్రమే అంతరాయం ఏర్పడిందని వారు చెబుతున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

శాయంపేట/బయ్యారం, ఆగస్టు 21: హనుమకొండ జిల్లా శాయంపేటలో వంగరి రాజు–విజయ దంపతుల ఐదేండ్ల కుమారుడు శివసాయి ఇంటి నుంచి వచ్చి బాలికల హైస్కూల్ ఎదుట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో కుక్కలు దాడి చేసి ఎడమ చేయిని కొరకడంతో గాయాలయ్యాయి. వెంటనే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మధ్యాహ్నం అవే కుక్కలు పాఠశాల అటెండర్‌పైనా దాడి చేశాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లిలో షేక్ యూసఫ్– రిజ్వానా దంపతుల మూడేండ్ల చిన్నారి సుఫియాన్‌కు తల్లి ఇంటి ముందు అన్నం తినిపిస్తుండగా వీధి కుక్క వచ్చి చిన్నారి గొంతు పట్టేసింది. తల్లి కేకలు వేయడంతో యూసఫ్ వచ్చి కుక్క నుంచి కొడుకును కాపాడాడు. యూసఫ్ కాలిని గాయపరిచింది. చిన్నారిని మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు.

జీతాల కోసం భగీరథ కార్మికుల ఆందోళన

ఆర్నెళ్లుగా జీతాలు రాకపోవడంతో మిషన్ భగీరథ కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని మిషన్ భగీరథ గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే వేతనాలు మంజూరు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. - ఇందల్వాయి

పేకాటరాయుళ్లతో పోలీసుల కుమ్మక్కు

హైదరాబాద్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ) : విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్–2 ఐజీ వీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ సమీపంలో కొంతమంది పేకాడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. పేకాట రాయుళ్లకు సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ జములప్ప, ఎస్సై విక్రం.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎస్సై శ్రీనివాసులుపై చర్యలు తీసుకున్నారు. అలాగే గద్వాల సీఐ భీమ్‌కుమార్‌ను వీఆర్‌కు అటాచ్ చేశారు.

తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం



తెలంగాణభవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అసంబద్ధ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వహీద్ డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అడ్డగోలుగా నోరుజారితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

సౌత్ ఆర్ఆర్ఆర్‌లో మార్పులు

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభించాలని, ఏవైనా సాంకేతిక , ఇతర సమస్యలుంటే కేంద్రంతో చర్చించాలని సూచించారు. సీఎస్‌తోపాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అప్‌డేట్ చేయాలని సూచించారు. రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా సీఎం పలు సూచనలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న వివిధ పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఈ రోడ్ల ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. రహదారుల అనుసంధాన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలని, సిగ్నల్, ఇతర సమస్యల్లేకుండ